క్లుప్తంగా

పాలకుల చిత్తశుద్ధితోనే అవినీతికి అడ్డుకట్ట

లక్ష్మీపురం: పాలనలో అవినీతిని అరికట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో ఓ పెద్ద సవాల్ అయినా పాలకులు చిత్తశుద్ధి ఉంటే అవినీతి 90 శాతం వరకు అరికట్టవచ్చని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అచ్యుత ఇందుశేఖర్, ఇంజినీర్ ఎస్.సదాశివం మాట్లాడారు.

రేషన్ బియ్యం స్వాధీనం

లక్ష్మీపురం: రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని అరండల్‌పేట పోలీసులు అదుపులో తీసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. శ్రీనగర్ మెయిన్ రోడ్డులో ఏటీ అగ్రహారానికి చెందిన రామకృష్ణ, మరి కొందరు రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు అరండల్‌పేట పోలీసులకు సమాచారం వచ్చింది. సమాచారం తెలుసుకున్న సీఐ వీరాస్వామి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం ఆటోను పట్టుకున్నారు. ఆటోను పరిశీలించగా ఆటోలో 60 బస్తాలు సుమారు మూడువేల కిలోల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. దీంతో అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని రామకృష్ణతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భగవద్గీతలోని కర్మ, భక్తి, జ్ఞానాన్ని అనుభవంలోకి తేవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: భగవద్గీతలోని కర్మ, భక్తి, జ్ఞానాన్ని అనుభవంలోకి తేవాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. బుధవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల సంస్కృత విభాగం ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలను జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ రేణుక మాట్లాడుతూ వేదాల్లోని జ్ఞానాన్ని మహా ఋషులు ఉప నిషత్తులుగా అందించగా, ఉప నిషత్తుల్లోని సారాన్ని వ్యాస భగవానుడు భగవద్గీత రూపంలో అందించాడన్నారు. సాహితీ సమాఖ్య కార్యదరి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జాతీయ నాయకులదంరూ భగవద్గీతను చదివి, స్ఫూర్తి పొందారని చెప్పారు. ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ వీవీ రామ్ కుమార్ మాట్లాడుతూ యుక్తాహార, ఆయుః సత్వ అనే రెండు శ్లోకాలను మన జీవితానికి అన్వయించుకుంటే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల పీజీ కోర్సుల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి, డిగ్రీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఏ భాను మురళీధర్, సంస్కృత విభాగాధిపతి డాక్టర్ పి.దేవేంద్రగుప్తా, డాక్టర్ ఏ.అంజనీకుమార్, ఆర్.జయశైలజ పాల్గొన్నారు.

మానవ జీవితాన్ని సంస్కరించేది భగవద్గీత



గుంటూరు ఎడ్యుకేషన్: మానవ జీవితాన్ని సంస్కరించేది భగవద్గీత అని బీహెచ్ మహిళా డిగ్రీ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ బీవీ విజయభాస్కర్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని బీహెచ్ కళాశాలలో గీతా జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ భగవద్గీత పవిత్ర గ్రంథ రూపంలో ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిందని అన్నారు. వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శి అని చెప్పారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చేగు శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కౌసల్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాధామాధవి, అధ్యాపకులు గిరిజ, లక్ష్మీదీప్తి పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు


నెహ్రూనగర్: ఉండవల్లి నుంచి గుంటూరు నగరపాలక సంస్థ హెడ్ వాటర్ వర్క్స్‌కు తాగు నీటిని సరఫరా చేసే 1600 ఎంఎం డాయ పైపు లైన్‌పై తక్కెళ్లపాడు గ్రామంలో ఏర్పడిన లీకులను బుధవారం పంపింగ్ అనంతరం ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతులు చేపట్టారు.

రోబోలతో మోకీలు శస్త్రచికిత్సలు

'గుంటూరుకు చెందిన సత్యశ్రీనివాస్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. మోకీలు సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. వైద్యులు పరీక్షలు చేసి జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీతో సమస్యకు చెక్ పెట్టవచ్చు అన్నారు. నిత్యం కంప్యూటర్స్‌తో తలమునకలయ్యే ఉద్యోగి వైద్యులు ఆపరేషన్ సక్రమంగా చేస్తారో లేదో అనే సందేహంతో ఆపరేషన్ వాయిదా వేసుకుంటూ వచ్చారు. మోకీలు మార్పిడి ఆపరేషన్లకు రోబో టెక్నాలజీతో ఆపరేషన్‌లు చేస్తున్నారు. దీంతో ఆపరేషన్ చేయించుకుని సాధారణ జీవితం సాగిస్తున్నాడు.'

- అందుబాటులో గుంటూరులో ఆధునిక చికిత్సలు
- రోబో ఆపరేషన్‌తో నూరు శాతం సత్ఫలితాలు
- పెరుగుతున్న జాయింట్ పెయిన్స్ బాధితులు
- ముందస్తు జాగ్రత్తలతో నివారించవచ్చు

ఆపరేషన్‌లకు ఆధునిక సాంకేతికత తోడు



గుంటూరు మెడికల్: స్మార్ట్ ఫోన్‌ల యుగంలో ప్రతి రంగంలో పోటీ పెరిగింది. ముఖ్యంగా వైద్య రంగంలో సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగించి రోగులకు అత్యాధునిక వైద్య సేవలను చేరువ చేసేందుకు వైద్యులు పోటీ పడుతున్నారు. అందులో భాగంగా ల్యాప్రోస్కోపి ఆపరేషన్లు, కీ హోల్ సర్జరీలు, లేజర్ సర్జరీలు, విరివిగా వినియోగంలో ఉన్నాయి. వీటికి మించి మరింత మెరుగైన వైద్య సేవలను రోగులకు అందించేందుకు రోబోటిక్ సర్జరీలను వైద్యులు చేస్తున్నారు. మెడికల్ హబ్‌గా గుర్తింపు తెచ్చుకున్న గుంటూరులో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి, ఆపరేషన్‌లు చేసేందుకు వైద్యులు పోటీ పడుతున్నారు. మెట్రోపాలిటన్ లాంటి నగరాల్లో లభించే రోబోటిక్ సర్జరీలను గుంటూరు నగరంలోని అందరికీ అందుబాటులో ఉండేలా తీసుకొచ్చారు.

యుక్తవయస్సులోనే జాయింట్ పెయిన్స్

జీవితంలో ఎన్నో ఆటుపోట్లకు గురి అవుతూ వృద్ధాప్యంలోకి అడుగిడిన తరుణంలో మరింత ఆందోళనకు, బాధకు గురిచేసేవి కీళ్లనొప్పులే (జాయింట్ పెయిన్స్). కాని ఆధునిక జీవనశైలి వల్ల యుక్తవయస్సులోనే కీళ్ల అరుగుదల సమస్యతో పలువురు బాధితులు వైద్యులను ప్రతిరోజూ సంప్రదిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ 300 మంది వివిధ రకాల సమస్యలతో ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి వస్తుండగా వీరిలో 30 శాతం మంది ఆర్థరైటిస్ సమస్య బాధితులే. గుంటూరు జిల్లాలో 140 ఆర్థోపెడిక్ క్లీనిక్‌లు ఉండగా వీటిలో ప్రతిరోజూ 30 మందికి పైగా ఆర్థరైటిస్ సమస్యతో వైద్యం కోసం వస్తున్నారు. కీళ్ల బాధితులకు వైద్యులు మోకీలు మార్పిడి ఆపరేషన్లు చేసి నూతన జీవితాన్ని ప్రసాదిస్తున్నారు. వైద్యుల ఆపరేషన్‌లలో రెండు నుంచి మూడు శాతం మందికి ఏదైనా సైడ్ ఎఫెక్ట్ ఎదురవ్వచ్చు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా నూటి నూరు శాతం కచ్చితత్వంతో రోబోటిక్ ఆపరేషన్లు గుంటూరులో చేస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి...

చిన్న వయస్సులోనే కీళ్ల అరుగుదలకు పొగ తాగడం, స్థూలకాయం ప్రధాన కారణాలు. అయితే 55 సంవత్సరాలు పైబడిన వారిలో, స్థూలకాయం ఉన్నవారిలో, గతంలో కీళ్లకు దగ్గరగా ఫ్రాక్చర్ అయిన వారిలో, కీళ్ల వాతంతో బాధపడే వారిలో, మహిళల్లో ప్రత్యేకించి రుతు క్రమం ఆగి పోయినవారిలో కీళ్ల అరుగుదల సహజంగా ఉంటుంది. నివారణ కోసం క్రమబద్ధమైన వ్యాయామం, అధిక శాతం కూరగాయలు, పండ్లు, విటమిన్-డీ, కాల్షియం అధికంగా లభించే పాల ఉత్పత్తులు, చేపను ఆహారంగా తీసుకోవాలి.

రోబో సర్జరీలతో నూరు శాతం కచ్చితత్వం



ఆధునిక మోకీలు సర్జరీలు గుంటూరు ప్రజలకు చేరువ చేసేందుకు రోబోటిక్ సర్జరీలు అందుబాటులోకి తీసుకొచ్చాం. సాధారణంగా వైద్యులు చేసే ఆపరేషన్‌లలో రెండు నుంచి మూడు శాతం ఏమైనా ఇబ్బందికరమైన పరిస్థితి తలెత్తవచ్చు. అలాంటి సమస్యలు ఏమాత్రం లేకుండా నూటికి నూరు శాతం కచ్చితత్వంతో రోబోటిక్ సర్జరీలు చేస్తున్నాం. రోబోటిక్ సర్జరీ వల్ల ఇన్‌ఫెక్షన్లు సోకవు. రక్తం పోవడం తక్కువగా ఉంటుంది. నొప్పి ఉండదు. రోగి త్వరగా కోలుకుంటారు. జాయింట్లు కాలపరిమితి ఎక్కువ కాలం ఉంటుంది. ఇన్సూరెన్సు కార్డులు ఉన్నవారికి ఉచితంగా రోబోటిక్ సర్జరీలు చేస్తున్నాం.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీధి కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, యాంటీ ర్యాబీస్ వ్యాక్సినేషన్ ఏటుకూరు రోడ్‌లో ప్రత్యేకంగా స్నేహ వెల్ఫేర్ వెల్ఫేర్ సొసైటీ చేస్తుందన్నారు. నగర పరిధిలో సమర్థంగా నిర్వహించేందుకు గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు ప్రత్యేకంగా వాహనాలు, సూపర్వైజర్, డాగ్ క్యాచర్లకు విధులు కేటాయించినట్లు వివరించారు. వీధి కుక్కలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ప్రతి రోజు ప్రజారోగ్య అధికారులు అందించే షెడ్యూల్, పీజీఆర్ఎస్, 103 సెల్ ఫిర్యాదుల మేరకు ఉదయం 6 నుంచి 8, 10 నుంచి ఒంటి గంట వరకు విధులు నిర్వహిస్తారని చెప్పారు. ఆయా వార్డులకు ఈ బృందాలు వచ్చినప్పుడు స్థానిక శానిటేషన్ కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్లు తమ ప్రాంతంలో పట్టుకున్న కుక్కలు, తిరిగి వదిలిన వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని కోరారు.

విద్యుత్ ఒప్పందంలో అవినీతి అక్రమాలు

లక్ష్మీపురం: ప్రభుత్వ పెద్దలకు లంచాలు ఇచ్చి ఆయాచిత లబ్ధి పొందేందుకు కార్పొరేట్ శక్తులు ఇలాంటి చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఐ నాయకుడు కె.శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. రామిరెడ్డి తోటలో విద్యుత్ చార్జీల పెరుగుదలను వివరిస్తూ కరపత్రాలు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ స్థానిక శాఖ కార్యదర్శి టి.రాధ, నక్కా మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కేరళ ప్రభుత్వంపై కేంద్రం కక్ష సాధింపు మానుకోవాలి

లక్ష్మీపురం: కేరళ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, రైతు సంఘ జిల్లా కార్యదర్శి కంచుమటి అజయ్ అన్నారు. లాడ్జిసెంటర్‌లోని కార్మిక, రైతు, ప్రజా సంఘాలు పిలుపులో భాగంగా బుధవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని ఆదుకునే పద్ధతిలో సాగు రైతులందరికీ పూర్తి రుణమాఫీ చేసి, కొత్త రుణాలు మంజూరు చేసి, సబ్సిడీలు పెంచి, మద్దతు ధరలు కల్పిస్తూ రైతు, కౌలు రైతులకు గిట్టుబాటు అయ్యే విధంగా అన్ని రకాలు సహాయ సహకారాలు అందిస్తోందని చెప్పారు. ఇటీవల వాయనాడ్ ప్రాంతంలో తుఫాన్‌తో అతలాకుతులమై భారీ నష్టం సంభవించిన వారికి ఇతరులు సహాయం అందకుండా అడ్డుకొని, కేంద్రం ఏమాత్రం ఈ తుఫాన్ బాధితులను ఆదుకోలేదని తెలిపారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే విధంగా ప్రజల హక్కులను హరించే విధంగా ప్రవర్తించడమే కాకుండా అభివృద్ధిని ఆటంక పరుస్తూ అన్ని రకాలుగా కేరళ రాష్ట్రాన్ని బలహీనపడే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కేంద్రానికి అనుకూలంగా లేని రాష్ట్రాలపై రకరకాల రూపంలో ఫెడరల్ వ్యవస్థను నాశనం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



లాడ్జిసెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా సంఘాలు

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

ఏఎన్‌యూ: యూనివర్సిటీ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు సూచించారు. ఏపీ పీజీ సెట్ ద్వారా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆయా విభాగాల్లో ప్రవేశాలు పొందిన మొదటి ర్యాంకు విద్యార్థులకు యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈసభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీలో తాను కష్టపడి చదివానని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకున్నానని వివరించారు. గ్రామీణ ప్రాంతాలలో, పేద కుటుంబంలో పుట్టి ఎమ్మెల్సీగా ఎదగడానికి ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా మారిందని తెలిపారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఎంతో ఉందని చెప్పారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని విద్యార్థులు చదువుకోవాలని, ప్రపంచానికి తెలియని విషయాలన్నీ టెక్నాలజీ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. కామర్స్ విభాగాధిపతి శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు నమ్మకాన్ని విద్యార్థులు నిలబెట్టుకోవాలని, కష్టపడి చదివి మంచి ఫలితాలను సాధించాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. కిరణ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను అలవాటు చేసుకోవాలి ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగిన స్పందించు అనే చేగువేరా నినాదాన్ని మనందరం గుర్తు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రథమ ర్యాంకర్లను అభినందిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఏఎన్‌యూ రిజిస్ట్రార్ సింహాచలం

అప్కాస్ ఉద్యోగులకు జీతాలు చెల్లింపు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయంలో అప్కాస్ పద్ధతిలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు నవంబర్ జీతాలు 10వ తేదీ వరకు చెల్లించకపోవడంపై 'సాక్షి'లో బుధవారం 'అప్కాస్ ఉద్యోగులకు పస్తులే...' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ట్రెజరీలో జీతాలకు సంబంధించిన బిల్లును క్లియరెన్స్ చేసి బుధవారం మధ్యాహ్నానికి వారి బ్యాంకు ఖాతాలకు నవంబర్ నెల జీతాలు జమ చేశారు. గత ప్రభుత్వంలో ప్రతి నెల 1వ తేదీన జీతాలు అందేవని...కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1వ తేదీన జీతాలు పడిన పాపన పోలేదని, 'సాక్షి' చొరవపై ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్

ప్రారంభమైన శ్రీమద్భాగవతం ప్రవచనాలు



మాట్లాడుతున్న కైలాసనాథ్

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం శ్రీమద్భాగవతం ధారావాహిక ప్రవచనాలు ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేశారు. బ్రహ్మశ్రీ మల్లాది కైలాసనాథ్ ప్రసంగిస్తూ విజయాన్ని భగవద్గీత సాధించి పెడుతుందని అన్నారు. నేటి యువత విధిగా భగవద్గీత చదవాలని చెప్పారు. అందులోని అంశాలను అర్థం చేసుకుని, జీవితాలకు అన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని అన్నారు. ఆచరించిన ప్రతి ఒక్కరికి విజయాన్ని అందించే గ్రంథం భగవద్గీత అని పేర్కొన్నారు.

ఏఎల్ బీఈడీ కళాశాల అధ్యాపకుడికి పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: లాడ్జి సెంటర్‌లోని ఆంధ్ర లూథరన్ (ఏఎల్) బీఈడీ కళాశాల అధ్యాపకుడు వడ్డే శేఖర్‌బాబుకు ఏఎన్‌యూ విద్యా విభాగంలో పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య మాదాసు ఎస్తేరు సునీల పర్యవేక్షణలో ''సెల్ఫ్ ఎఫికసీ ఆఫ్ అడాల్‌సెస్ ఇనఫ్ రిలేషన్ టు స్ట్రెస్, మెంటల్ హెల్త్ అండ్ అకడమిక్ అచీవ్‌మెంట్'' అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ వడ్డే శేఖర్‌బాబును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్తేరు సునీల, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

లలిత కళా ఉత్సవంలో విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి లలిత కళా ఉత్సవంలో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభావంతులుగా నిలిచారని పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. బుధవారం లక్ష్మీపురంలోని పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ కథారచనలో 7వ తరగతి విద్యార్థిని జె.పల్లవి, తాళ ప్రదానంలో 9వ తరగతి విద్యార్థి జి.భరణి ప్రతాప్ సర్వోత్తమ స్థానాల్లో నిలిచారని చెప్పారు. అదే విధంగా కీబోర్డులో 9వ తరగతి విద్యార్థి కె.వెంకటసాయి చరణ్, తాళ ప్రదానంలో జైనీల్ విశిష్టోత్తమ స్థానాన్ని పొందగా, తాళ ప్రదానంలో 9వ తరగతి విద్యార్థి టి.బోస్ అనుదీప్ కృష్ణ, లేఖారచనలో 7వ తరగతి విద్యార్థి షిరీన్ ఉత్తమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు వివరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా కళల్లోనూ నిష్ణాతులవుతారని తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో-ఆర్డినేటర్లు దుర్గాశ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున విష్ణువర్ధన్, వరప్రసాదరావు, కృష్ణవేణి

న్యాయవాదుల సమస్యలపై వినతిపత్రం

నగరంపాలెం: రాష్ట్ర హైకోర్టులో బుధవారం ఏపీ బార్ కౌన్సిల్ కార్యదర్శికి గుంటూరు, కృష్ణా జిల్లాల బార్ అసోసియేషన్ల నాయకులు వినతిపత్రం అందించారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. బార్ అసోసియేషన్ల అధ్యక్షులు కాసు వెంకటరెడ్డి(గుంటూరు జిల్లా), కొత్త చంద్రమౌళి(కృష్ణా జిల్లా), బి.అశోక్ (మచిలీపట్నం), నాయకులు అరిగెల శివరామప్రసాద్‌రాజా, సుందరరావు, న్యాయవాదులు పాల్గొని, సమస్యలను పరిష్కారించాలని వినతిపత్రంలో కోరారు. ప్రధానంగా సి.ఓ.పి, బీమా వంటి సమస్యలపై వినతిపత్రం అందించినట్లు గుంటూరు జిల్లా అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి తెలిపారు. త్వరలో రాష్ట్రంలోని బార్ అసోసియేషన్లతో సమావేశమై, న్యాయవాదుల సమస్యలను పరిష్కరించుకునేందుకు భవిష్యత్ కార్యచరణను రూపొందిస్తామని ఆయన చెప్పారు.



కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న బార్ అసోసియేషన్ల నాయకులు

లండన్ టు అమరావతి పుస్తకావిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగ అధ్యాపకులు ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి రచించిన లండన్ టు అమరావతి నవలను బుధవారం వీసీ కె.గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ చెన్నారెడ్డి తన రచనల ద్వారా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తున్నారని చెప్పారు. సాహిత్యం నేటి తరానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. పుస్తక పఠనంలో ఉన్న మక్కువ సాహిత్య రచనలో చూపినట్లయితే విలువైన సాహిత్య సంపద సృష్టించవచ్చునని చెప్పారు. ఆచార్య చెన్నారెడ్డి సాహిత్య రచనలు ఆహ్వానించ తగినవని అభినందించారు. రెక్టార్ కె.రత్న షీలా మణి మాట్లాడుతూ బోధన, పరిశోధనలతో పాటు సాహిత్యంపై చెన్నారెడ్డి చూపిస్తున్న మక్కువ ప్రశంసనీయమని కొనియాడారు. రిజిస్ట్రార్ జి.సింహాచలం, ప్రిన్సిపాల్స్ సురేష్ కుమార్, వీరయ్య, జాన్సన్, ప్రమీలరాణి మాట్లాడుతూ చెన్నారెడ్డి రచనలు విలువైనవని కొనియాడారు. పుస్తక రచయిత చెన్నారెడ్డి మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఒక నూతన ఘట్టాన్ని కథాంశంగా తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ రవికుమార్, రూస కోఆర్డినేటర్ ఎస్ .మురళీమోహన్, పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ జీవీఎస్ఆర్ అంజనేయులు, విదేశీ విద్యార్థుల విభాగం డైరెక్టర్ పి.పద్మావతి, హెచ్ఆర్ఎం విభాగాధిపతి డాక్టర్ బి.నాగరాజు, జర్నలిజం ఇన్‌చార్జి కోఆర్డినేటర్ డాక్టర్ జె.మధుబాబు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ కె.గంగాధరరావు